క్లుప్తంగా

తమ్మినేనికి పేరాడ శుభాకాంక్షలు



తమ్మినేని సీతారాంతో ఎంపీ అభ్యర్థి పేరాడ తిలక్, పార్టీ నాయకులు

ఆమదాలవలస: ఆమదాలవలస వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా తమ్మినేని సీతారాం నామినేషన్ వేసిన సందర్భంగా శ్రీకాకుళం ఎంపీ అభ్యర్థి పేరాడ తిలక్ సోమవారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా తమ్మినేని తన స్వగృహం వద్ద మాట్లాడుతూ ఈసారి వైఎస్సార్‌సీపీ అభ్యర్థులంతా గెలుపు జెండా ఎగురవేయడం ఖాయమన్నారు. అందుకు నిదర్శనం నామినేషన్‌లు వేసేందుకు నాయకుల వెంట వచ్చిన ప్రజలేనని అన్నారు. ఎంపీగా తిలక్, ఎమ్మెల్యేగా తాను గెలుస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కళింగ వైశ్య కార్పొరేషన్ చైర్మన్ అంధవరపు సూరిబాబు, ఆమదాలవలస నియోజకవర్గ పరిశీలకుడు మెంటాడ స్వరూప్, పార్టీ రాష్ట్ర యువజన విభాగ ప్రధాన కార్యదర్శి తమ్మినేని చిరంజీవినాగ్, వివిధ హోదాల్లో ఉన్న పార్టీ నాయకులు పాల్గొన్నారు.

వెండి ఆభరణాల అలంకరణ



విగ్రహాలకు అలంకరించిన వెండి ఆభరణాలు

ఆమదాలవలస రూరల్: మండలంలోని కొత్తవలస గ్రామంలో గల రామాలయానికి దాతల సహకారంతో తయారుచేయించిన వెండి ఆభరణాలను సోమవారం సీతారాముల విగ్రహాలకు అలంకరణ చేశారు. దాతల సహకారంతో సీతారామలక్ష్మణ, ఆంజనేయస్వామి విగ్రహాలకు కిరీటాలు, నేత్రాలు వెండితో తయారు చేసినవి ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో విశేష పూజలతో అలంకరణ చేశారు. ఈ పూజల్లో గ్రామానికి చెందిన భక్తులు పాల్గొన్నారు.

ధర్మాన కృష్ణదాస్‌ను గెలిపించండి



పచూరీ కాలనీలో ప్రచారం చేస్తున్న ధర్మాన గ్రీష్మ

నరసన్నపేట: మండల కేంద్రంలోని బర్మా కాలనీ, చెరువు గట్టు, పచూరీ కాలనీ, శ్రీరామ్ నగర్‌తోపాటు సమీప ప్రాంతాల్లో నరసన్నపేట వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ధర్మాన కృష్ణదాస్‌కు మద్దతుగా ఆయన కోడళ్లు ధర్మాన శ్రావణి, ధర్మాన గ్రీష్మ సోమవారం ప్రచారం చేపట్టారు. ఇంటింటికీ వెళ్లి ఫ్యాన్ గుర్తుపై ఓటు వేయాలని కోరారు.

మనస్థాపంతో యువకుడు మృతి

హిరమండలం: తన కుమారుడు మృతికి ఇద్దరు వ్యక్తులు కారణమంటూ హిరమండలం రెల్లి వీధికి చెందిన కళింగపట్నం భూలోకం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సోమవారం ఫిర్యాదు చేశారు. వివరాల్లోకి వెళ్తే.. రెల్లివీధికి చెందిన కళింగపట్నం ధనుంజయరావు (26) అదే ప్రాంతానికి చెందిన పందిరి రాజా వద్ద గత నెల రూ.5 వేలు అప్పుగా తీసుకున్నాడు. కొంత సొమ్మును తీర్చగా..మిగిలిన సొమ్ము ఇవ్వాలని ఈ నెల 10న అడగడంతో ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. ఆ సమయంలో రాజాకు మద్దతుగా అతని స్నేహితుడు మిన్నారావు నిలిచాడు. స్థానికులు సముదాయించడంతో వివాదం సద్దుమణిగింది. మరుసటి మరోసారి వాగ్వాదానికి దిగడంతో మనస్తాపానికి గురైన ధనుంజయరావు గడ్డి మందు తాగి అపస్మారకస్థితికి చేరుకున్నాడు. కుటుంబ సభ్యులు వెంటనే శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. ఈ నెల 20న సీతాపురంలో ఉన్న సోదరి అనారోగ్యానికి గురికావడందో పరామర్శించేందుకు వెళ్లగా పరిస్థితి విషమించడంతో సోమవారం మళ్లీ రిమ్స్‌కు తరలించే ప్రయత్నం చేశారు. సుభలాయి వద్దకు చేరేసరికి మృతిచెందాడు. స్థానిక ఎస్సై జి.నారాయణస్వామి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సైకత హనుమాన్



ఆమదాలవలస రూరల్: హనుమాన్ జయంతి సందర్భంగా ఆమదాలవలస మండలం గాజులకొల్లివలస సమీపంలో సంగమేశ్వర ఆలయం వద్ద సైకత శిల్పి గేదెల హరికృష్ణ సోమవారం వేసిన సైకత శిల్పం విశేషంగా ఆకట్టుకుంటోంది. హనుమాన్‌కు సైకత రూపంలో పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలియజేశారు.

పుడమి తల్లిని పరిరక్షిద్దాం

పొందూరు : ప్రపంచ ధరిత్రీ దినోత్సవం సందర్భంగా పొందూరు మండలం తాడివలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు భూమి ఆకృతిలో కూర్చొని ప్రదర్శన చేశారు. మొక్కలు నాటడం ద్వారా భూమిని కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి హెచ్‌ఎం, నేషనల్ గ్రీన్‌కోర్ క్లస్టర్ కో–ఆర్డినేటర్ పూజారి హరిప్రసన్న, ఉపాధ్యాయులు రావాడ పాపారావు, ధవళ పెంటయ్య తదితరులు పాల్గొన్నారు.

అట్టహాసంగా తమ్మినేని నామినేషన్

- వైఎస్సార్‌సీపీ పాలనలోనే ఆమదాలవలస నియోజకవర్గం అభివృద్ధి
- టీడీపీకి ఇవే చివరి ఎన్నికలు
- స్పీకర్ తమ్మినేని సీతారాం



ఆమదాలవలస: మాట్లాడుతున్న తమ్మినేని సీతారాం



ఆమదాలవలస: ర్యాలీగా వస్తున్న పార్టీ శ్రేణులు



సరుబుజ్జిలి: పురుషోత్తపురం నుంచి తరలివెళ్లిన ప్రజలు



ఆమదాలవలస: వైఎస్సార్‌సీపీ జెండాలు పట్టుకుని బయల్దేరిన ఎమ్మార్పీఎస్ నాయకులు

ఆమదాలవలస: టీడీపీకి ఇవి చివరి ఎన్నికలని, ఆ పార్టీని భూస్థాపితం చేద్దామని ఆమదాలవలస వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి తమ్మినేని సీతారాం అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఆర్వో ఎం.నవీన్‌కు తన నామినేషన్ పత్రాన్ని సోమవారం అందజేశారు. తమ్మినేని ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీ హోరెత్తింది. మండుటెండను లెక్క చేయకుండా అధిక సంఖ్యలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హాజరయ్యారు. ఈ సందర్భంగా తమ్మినేని సీతారాం మాట్లాడుతూ ఆమదాలవలస నియోజకవర్గం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలోనే పూర్తి స్థాయిలో అభివృద్ధి చెందిందన్నారు. నియోజకవర్గాన్ని ఎడ్యుకేషన్ హబ్‌గా తీర్చిదిద్దామన్నారు. చంద్రబాబు అబద్ధపు మాటలు నమ్మేందుకు ప్రజలు సిద్ధంగా లేరన్నారు. ప్రజలంతా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ చేయాలని నిర్ణయించుకున్నారు. ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి ఆమదాలవలస ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా పేరాడ తిలక్‌ను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ మున్సిపల్ మాజీ ఫ్లోర్ లీడర్ బొడ్డేపల్లి రమేష్‌కుమార్, పార్టీ ముఖ్య నాయకులు బెండి గోందరావు, కె.వి.జి.సత్యనారాయణ, ఖండాపు గోవిందరావు, బెవర మల్లేశ్వరరావు, పప్పల రమేష్, లోలుగు కాంతారావు, శ్రీరాముల నాయుడు, సురవరపు నాగేశ్వరరావు, బోర చిన్నంనాయుడు, బొడ్డేపల్లి నారాయణరావు, ఆమదాలవలస, ఆమదాలవలస మున్సిపాలిటీ, సరుబుజ్జిలి, బూర్జ, పొందూరు మండలాలకు చెందిన పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

తమ్మినేని నామినేషన్‌కు తరలిన అభిమానులు

ఆమదాలవలస రూరల్: ఆమదాలవలస నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా తమ్మినేని సీతారాం సోమవారం నామినేషన్ వేయడంతో ఈ కార్యక్రమానికి మండలంలోని అన్ని గ్రామాల్లోని వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, అభిమానులు తరలివెళ్లారు. ఏ గ్రామంలో చూసినా జై జగన్, జై తమ్మినేని నినాదాలు మార్మోగాయి.

సరుబుజ్జిలి మండలం నుంచి..

సరుబుజ్జిలి: ఆమదాలవలస వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాం నామినేషన్ కార్యక్రమానికి మండలంలోని 21 పంచాయతీల నుంచి కార్యకర్తలు భారీ ఎత్తున తరలివెళ్లారు. తమ్మినేనికి మద్దతుగా నిలిచారు.

వైఎస్సార్‌సీపీకే మా మద్దతు

ఆమదాలవలస: ఆమదాలవలస నియోజకవర్గానికి చెందిన ఎమ్మార్పీఎస్ నాయకులు, కార్యకర్తలు వైఎస్సార్‌సీపీకి మద్దతు తెలుపుతున్నామని ఆ సంఘం నాయకులు సవలాపురపు దేవరాజ్, గొంటి కృష్ణ, పెంకి వేణు, మురపాక కిరణ్ అన్నారు. ఆమదాలవలస నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి తమ్మినేని సీతారాం నామినేషన్‌కు తామంతా మద్దతు తెలిపామన్నారు. సీఎం జగన్‌మోహన్ రెడ్డి అమలు చేస్తున్న పథకాలు అందుకుంటూ ఆయనకు ద్రోహం చేయలేమని, అందుకే తమ నాయకుడు మందకృష్ణ మాదిగ మాటను ఎదిరించి వైఎస్సార్‌సీపీకి మద్దతు తెలుపుతున్నామన్నారు. ఎమ్మార్పీఎస్ కార్యకర్తలు పెంకి రవి, కురమాన అప్పారావు, బచ్చల ఆదినారాయణ, పెంకి రామారావు, ఎస్.రమణ, పి.తిరుపతి, ఎస్.వెకంటేష్ తదితరులు పాల్గొన్నారు.

జనసంద్రంగా పాతపట్నం



నామినేషన్ వేసేందుకు ర్యాలీగా వెళ్తున్న పాతపట్నం ఎమ్మెల్యే అభ్యర్థి రెడ్డి శాంతి

- ర్యాలీగా వెళ్లి నామినేషన్ వేసిన రెడ్డి శాంతి
- అధిక సంఖ్యలో తరలివచ్చిన జగనన్న అభిమానులు



ర్యాలీలో పాల్గొన్న సీఎం జగన్ అభిమాని



రెడ్డి శాంతికి స్వాగతం పలుకుతున్న మహిళలు



కొత్తూరు: నామినేషన్‌కు బయలుదేరిన కలమట రమేష్‌బాబు, రాజులునాయుడు, పార్టీ అభిమానులు



కొత్తూరు: నామినేషన్‌కు వెళ్లే వాహనాలను జెండా ఊపి ప్రారంభించిన పీఏసీఎస్ చైర్మన్ సూర్యనారాయణ

ఎల్.ఎన్.పేట/పాతపట్నం: పాతపట్నం నియోజకవర్గం వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా రెడ్డి శాంతి సోమవారం నామినేషన్ వేశారు. పాతపట్నంలో కొలువైన నీలమణి దుర్గ అమ్మవారి ఆలయానికి చేరుకుని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అక్కడి నుంచి ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయానికి చేరుకున్నారు. కుటుంబ సభ్యులతో కలిసి క్యాంప్ కార్యాలయం నుంచి ర్యాలీగా తరలి వచ్చి తహసీల్దార్ కార్యాలయంలో నామినేషన్ పత్రాలను ఎన్నికల రిటర్నింగ్ అధికారి (ఆర్‌ఓ) ఎం.అప్పారావుకు అందజేశారు. పాతపట్నం నియోజకవర్గంలోని కొత్తూరు, పాతపట్నం, మెళియాపుట్టి, హిరమండలం, ఎల్.ఎన్.పేట మండలాల నుంచి పార్టీ ముఖ్య నాయకులు, అభిమానులు, పార్టీ కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఐదు మండలాల నుంచి వచ్చిన గిరిజనులు సందడి చేశారు. తప్పెటగుళ్లు, తీన్‌మార్ డాన్స్‌లు, ఒడిశా సంప్రదాయ వాయిద్యాలు ఎంతో అకట్టుకున్నాయి. ఈ సందర్భంగా జనసంద్రాన్ని ఉద్దేశించి రెడ్డి శాంతి మాట్లాడారు. 2019 కంటె 2024 ఎన్నికల్లో మరింత ఎక్కువ మెజార్టీతో గెలిపించాలన్నారు. తన విజయంలో అండగా నిలిచిన ప్రతి ఒక్కరికీ ఎప్పటికీ రుణపడి ఉంటానని ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు, నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్, ఎమ్మెల్సీలు పాలవలస విక్రాంత్, నర్తు రామారావు, పార్టీ సీనియర్ నాయకులు పాలవలస రాజశేఖరం, పాలవలస ఇందమ్మ, రెడ్డి శ్రావణ్, రెడ్డి ఓం శ్రీకృష్ణ, కరిమి రాజేశ్వరరావు, జెడ్పీటీసీలు లింగాల ఉషారాణి, కిలారి త్రినాథులు, కామక భాగ్యలక్ష్మి, గూడ ఎండయ్య, ఎంపీపీలు దొర సావిత్రమ్మ, రెడ్డి జ్యోతిలక్ష్మి, పార్టీ నాయకులు మిరియాపల్లి శ్యామ సుందరరావు, పెనుమజ్జి విష్ణుమూర్తి, ఉర్లాన బాలరాజు, ఎ.వి.సురేష్, చింతాడ సూర్యనారాయణ, కొల్ల కృష్ణ, సవిరిగాన ప్రదీప్, పల్లి యోగి, సారిపల్లి ప్రసాదరావు, రెడ్డి రామారావు, ఈగల చిన్నారావు, పడాల లక్ష్మణరావు, గోగుల వరప్రసాదరావు, కలమట రమేష్, గండివలస ఆనందరావు, బూర్లె శ్రీనివాసరావు, కె.జానకమ్మ తదితరులు పాల్గొన్నారు.

నామినేషన్‌కు తరలిన అభిమానులు

కొత్తూరు: పాతపట్నం వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా రెడ్డి శాంతి వేసిన నామినేషన్‌కు కొత్తూరు మండలం నుంచి అధిక సంఖ్యలో పార్టీ అభిమానులు, ప్రజలు హాజరయ్యారు. పీఏసీఎస్ చైర్మన్ చింతాడ సూర్యనారాయణ, పార్టీ మండల అధ్యక్షుడు సారిపల్లి ప్రసాదరావు, పార్టీ సీనియర్ నాయకులు కలమట రమేష్‌బాబు, ఏఎంసీ మాజీ చైర్మన్ గోగుల వరప్రసాదరావు, పడాల లక్ష్మణరావు, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ తోట నందకుమార్ తదితరులు పాల్గొన్నారు.

సత్తాచాటిన సర్కారు బడి





నరసన్నపేట: చల్ల ఢిల్లీశ్వరరావు (589) | పి.మెర్సీ (585) | ఎం.జ్యోత్స్నకు స్వీట్ తినిపిస్తున్న హెచ్‌ఎం (581)



ఎల్.ఎన్.పేట: 588 మార్కులు సాధించిన రాహుల్‌ను అభినందిస్తున్న ఎంఈఓ చంద్రమౌళి, ఉపాధ్యాయులు



ఎల్.ఎన్.పేట: 583 మార్కులు సాధించిన ప్రశాంతిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

నరసన్నపేట: మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల టెన్త్ విద్యార్థులు సత్తా చాటారు. పది ఫలితాలు సోమవారం విడుదలయ్యాయి. మండలంలోని 13 ప్రభుత్వ స్కూళ్ల నుంచి 728 మంది పరీక్షలు రాయగా.. 671 మంది ఉత్తీర్ణత సాధించారు. గుండవల్లిపేటలోని జ్యోతీరావు పూలే రెసిడెన్సియల్ స్కూల్లో చల్ల ఢిల్లీశ్వరరావు 589 మార్కులతో సత్తా చాటాడు. నరసన్నపేట బోర్డు ఉన్నత పాఠశాలకు చెందిన పి.మెర్సీ 585 మార్కులు పొందారు. బాడాం ఉన్నత పాఠశాల విద్యార్థిని మొయ్యి జ్యోత్స్నకు 581 మార్కులు వచ్చాయని ఎంఈఓలు దాలినాయుడు, శాంతారావు అన్నారు.

సారవకోట: మండలంలోని సారవకోట, బుడితి, అలుదు, చిన్నకిట్టాలపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, కేజీబీవీ, సవరబొంతు ఆశ్రమ పాఠశాల నుంచి 391 మంది పది పరీక్షలు రాయగా వారిలో 383 మంది ఉత్తీర్ణులైనట్లు ఎంఈఓ రమణ తెలిపారు. సారవకోట, అలుదు, చిన్నకిట్టాలపాడు, కేజీబీవీ, సవరబొంతు ఆశ్రమ పాఠశాలల్లో శత శాతం ఫలితాలు సాధించారు. బుడితి ఉన్నత పాఠశాల 95 శాతం ఉత్తీర్ణ సాధించినట్లు ఎంఈఓ తెలిపారు.

బూర్జ: మండలంలోని 11 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. 487 మంది విద్యార్థులకు 458 మంది పాసయ్యారు.

ఎల్.ఎన్.పేట: మండలంలోని లక్ష్మీనర్సుపేట జెడ్పీ ఉన్నత పాఠశాలలో చదువుతున్న కె.రాహుల్ 588 మార్కులు, కొమ్ము వలస జెడ్పీ ఉన్నత పాఠశాలలో చదువుతున్న వై.ప్రశాంతి 583 మార్కులు సాధించారు. పూశాం జెడ్పీ ఉన్నత పాఠశాలలో 20 మందికి 20మంది ఉత్తీర్ణుల య్యారు. రావిచెంద్రి, లక్ష్మీనర్సుపేట, కొమ్మువలస, కరకవలస, కేజీబీవీ పాఠశాలలు 96 శాతం ఉత్తీర్ణత సాధించాయని ఎంఈఓ చంద్రమౌళి తెలిపారు.

పాతపట్నం: పాతపట్నం మోడల్ స్కూల్‌లో 97 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారని ప్రిన్సిపాల్ రత్నకుమారి తెలిపారు. పాతపట్నం బీఆర్ అంబేడ్కర్ గురుకులంలో 80 మందికి 78 మంది ఉత్తీర్ణత సాధిచారని ప్రిన్సిపాల్ కృష్ణతార తెలిపారు. మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలకు చెందిన 38 మందికి 38 మంది ఉత్తీర్ణత సాధించారని ప్రిన్సిపాల్ గణపతి శ్రీరాములు పేర్కొన్నారు.




ఎ.పవిత్ర, 590, కె.నాగలక్ష్మి, 590

పొందూరు: మండలంలోని ఏపీ మోడల్ స్కూల్లో 95 మందికి 95 మంది ఉత్తీర్ణులైయ్యారని ప్రిన్సిపాల్ హెచ్.ప్రభాకర్ తెలిపారు. ఎ.పవిత్ర 590 సాధించారు. లోలుగు కేజీబీవీలో 40 మందికి 38 మంది ఉత్తీర్ణులైయ్యారని ప్రిన్సిపాల్ ఆర్.సౌమ్య తెలిపారు. కింతలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 141 మందికి 139 మంది ఉత్తీర్ణులైయ్యారు. వారిలో కూన నాగలక్ష్మి–590, జి.గుణశేఖర్–585 మార్కులు, పైడి సుష్మ–583 మార్కులు, కిల్లాన జ్యోతిక–583 మార్కులు సాధించారు. పొందూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 251 మందికి 191 మంది ఉత్తీర్ణులయ్యారని హెచ్‌ఎం పి.వెంకటరావు తెలిపారు. తాడివలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 58 మందికి 58 మంది ఉత్తీర్ణులయ్యారని హెచ్‌ఎం బల్ల కంఠయ్య తెలిపారు. తోలాపి ఉన్నత పాఠశాలలో 17 మందికి 17 మంది ఉత్తీర్ణులైయ్యారని హెచ్‌ఎం వి.సత్యరాజు తెలిపారు. బి.కుసుమ –586 మార్కులు సాధించింది.



ఉదయ్‌కిరణ్, మణిని అభినందిస్తున్న హెచ్‌ఎం, ఉపాధ్యాయులు



వి.శ్రావ్య (583)

హిరమండలం: మండలంలో 362 మంది విద్యార్థులు పదివ తరగతి పరీక్షలు రాయగా.. 348 మంది ఉత్తీర్ణత సాధించారు. హిరమండలం ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన జి.ఉదయ్‌కిరణ్ 584 మార్కులు, బి.మణి 583 మార్కులతో టాపర్లుగా నిలిచారని హెచ్‌ఎం టి.కేశవరావు తెలిపారు. కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయలంలో 49 మంది విద్యార్థినులు పరీక్షలు రాసి శత శాతం ఉత్తీర్ణత సాధించారు. వై.శ్రావ్య 583 మార్కులు సత్తాచాటింది.




బొల్ల సాయిచరణ్, 581 | మాకివలస జస్మిత, 580

కొత్తూరు: మండలంలోని కుంటిభద్ర, నివగాం, కడుము, కురిగాం, మెట్టూరు. మాతల జెడ్పీ ఉన్నత పాఠశాలలు, కొత్తూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల, కేజీబీవీ, లబ్బ గిరిజన ఆశ్రమ పాఠశాలలకు చెందిన 612 మంది విద్యార్థులకు 522 మంది పాసయ్యారు. మెట్టూరు జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన బొల్ల సాయి చరణ్ 581, మాకివలస జస్మిత 580 మార్కులు సాదించారు.




టి.తేజశ్వని, 585 | గీతిక, 585




జి.సంజన, 584 | బి.చరిష్మా, 581

జలుమూరు: పది ఫలితాలలో కరవంజ మోడల్ స్కూల్ విద్యార్థులు సత్తా చాటారు. 84 మందికి 84 మంది పాసయ్యారు. టి.తేజశ్వని 585, జి.గీతిక 585, జి.సంజన 584, బి.చరిష్మా 581 మార్కులు సాధించారు. చల్లవానిపేట ఉన్నత పాఠశాల, జలుమూరు కేజీబీవీ విద్యార్థులు శత శాతం ఉత్తీర్ణులయ్యారు.




సీపాన రామ్ చరణ్ (586) | హనుమంతు వీక్షిత (586)




గురుగుబెల్లి జ్యోతిక (584) | పొట్నూరు మోహన్‌కృష్ణ (580)

ఆమదాలవలస: పట్టణంలోని లక్ష్మీనగర్ మున్సిపల్ హైస్కూల్‌కు విద్యార్థులు పది ఫలితాల్లో సత్తాచాటారు. సీపాన రామ్‌చరణ్ (586), హనుమంతు వీక్షిత (586), గురుగుబెల్లి జ్యోతిక (584), పొట్నూరు మోహన్‌కృష్ణ (580) మార్కులు సాధించారు.

‘పేట’లో ఫ్యాన్ ప్రభంజనం ఖాయం



జలుమూరు: మాట్లాడుతున్న ధర్మాన కృష్ణదాస్

జలుమూరు: నరసన్నపేటలో వైఎస్సార్‌సీపీ శ్రేణుల సమష్టి కృషితో భారీ ఆధిక్యతతో గెలవబోతున్నామని.. పేటలో పాగా వేసేది మనమేనని, ఇంటింటికీ వెళ్లి ఫ్యాన్ గుర్తును పరిచయం చేయాలని నరసన్నపేట ఎమ్మెల్యే అభ్యర్థి ధర్మాన కృష్ణదాస్ అన్నారు. జలుమూరు, సారవకోట మండలాల కార్యకర్తలతో సోమవారం జలుమూరు మండల కేంద్రంలోని ఓ కల్యాణ మండపంలో సమావేశం నిర్వహించారు. ఈ నెల 24న టెక్కలిలో సిద్ధం సభ జరగనుందని, 25న తాను నరసన్నపేటలో నామినేషన్ వేయనున్నానని ఈ రెండు కార్యక్రమాలను వియవంతం చేయాలన్నారు. పోలాకి జెడ్పీటీసీ సభ్యుడు ధర్మాన కృష్ణచైతన్య, ఎంపీపీ వాన గోపి, మాజీ ఎంపీపీ బగ్గు రామకృష్ణ, పార్టీ మండల అధ్యక్షుడు కనుసు సీతారాం, వరుదు వంశీకృష్ణ, అల్లాడ, చల్లవానిపేట, సారవకోట ఎం.శ్యామలరావు, పి.రాజప్పలనాయుడు, గెల్లంకి వెంకటరావు, మండల కన్వీనర్లు ధర్మాన జగన్, నక్క తులసీదాస్, వైస్ ఎంపీపీలు తంగి మురళీకృష్ణ, డోల నాగరత్నం, జి.రామారావు, ప్రధాన కార్యదర్శి జి.వి.రమణి, జిల్లా పంచాయతీరాజ్ అధ్యక్షుడు దామ మన్మధరావు తదితరులు పాల్గొన్నారు.

రానున్నది జగనన్న పాలనే..

నరసన్నపేట: మళ్లీ వైఎస్సార్‌సీపీ అధికారానికి వస్తుంది, సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రమాణ స్వీకారం చేస్తారని నరసన్నపేట ఎమ్మెల్యే అభ్యర్థి ధర్మాన కృష్ణదాస్ అన్నారు. స్థానిక కల్యాణ మండపంలో నరసన్నపేట, పోలాకి మండలాలకు చెందిన కార్యకర్తలు, నాయకులతో సమావేశం నిర్వహించారు. మే 13 వరకు చేపట్టాల్సిన కార్యక్రమాలను వివరించారు. 24న సీఎం జగన్ నరసన్నపేట మండలంలోని ఎన్‌హెచ్‌పై రోడ్ షో ఉందని, దీంట్లో పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. పోలాకి జెడ్పీటీసీ ధర్మాన కృష్ణచైతన్య, పార్టీ నాయకులు ధర్మాన రామదాస్, ముద్దాడ బైరాగినాయుడు, చీపురు కృష్ణ, ఎంపీపీ అరంగి మురళి, మార్కెట్ కమిటీ చైర్మన్ దుంపల భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా నీలమణి అమ్మవారి ఉత్సవం

హిరమండలం: మండల కేంద్రంలోని సుభలయలో గల నీలమణి అమ్మవారి 8వ వార్షికోత్సవ ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి.. ఐదేళ్ల తరువాత జరిగే ఈ సంబరాల్లో భాగంగా గ్రామంలోని అన్ని వీధులూ విద్యుత్ అలంకరణలతో ధగధగలాడుతున్నాయి. ఈ పండగ రెండో రోజైన సోమవారం గ్రామ దేవత పూజ, ప్రతిష్ట కార్యక్రమాలతోపాటు ఘటాల పూజలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

నామినేషన్ పేరుతో టీడీపీ జనసమీకరణ

పొందూరు: ఆమదాలవలస టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కూన రవికుమార్ మంగళవారం నామినేషన్ వేస్తున్నాన్నంటూ జనసమీకరణ చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ మండల పార్టీ కన్వీనర్ పప్పల రమేష్‌కుమార్ తెలిపారు. రవికుమార్ ఈ నెల 19న నామినేషన్ వేశారన్నారు. ఆమదాలవలసలో చంద్రబాబు మీటింగ్ ఉండటంతో జిల్లా అధ్యక్షుడి హోదాలో రవికుమార్ పది నియోజకవర్గాల నుంచి జనసమీకరణ చేస్తున్నారని అన్నారు. సోమవారం తమ్మినేని సీతారాం నామినేషన్‌కు వచ్చిన అశేష జనంతో వైఎస్సార్‌సీపీ విజయం ఖాయం కావడంతో భయపడి కూన రవికుమార్ జనసమీకరణ చేస్తున్నారన్నారు.